
సాక్షి
శ్రీకాకుళం
బుధవారం • 5 • ఫిబ్రవరి • 2025



పూతదశలో మంచుదెబ్బ

జీడిమామిడిపై మంచు ప్రభావం చూపిస్తోంది. పూత దెబ్బ తింటోంది.

- 8లో



ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి ఇంద్ర పుష్కరిణి వద్ద నమస్కరిస్తున్న భక్తురాలు

న్యూస్‌రీల్

ఆర్చి గేట్ .. నో కోడ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నడుస్తున్నా రథ సప్తమి వేడుకల్లో ఆ నిబంధనలేవీ పాటించలేదు. ఆలయ సింహద్వారం (ఆర్చి గేట్) వైపుగా డోనర్ పాస్‌లే కాక, రూ. 500, రూ. 300 టికెట్లు తీసుకున్నవారు క్యూలో రెండు, మూడు గంటలకు మించి ఉండిపోయారు. మరోవైపు వీవీఐపీ లైన్లంటూ పోలీసులు బారికేడ్లు తెరవడంతో రెవెన్యూ, ఎండోమెంట్, జ్యుడీషియరీ నుంచి తమ వెంట 15 నుంచి 20 మందికి పైగా ఒకేసారి ఎలాంటి పాసులు లేకపోయినా వెళ్లిపోయారు. మరోవైపు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, గౌతు శిరీషల వెంట అనుచరులైతే భారీగా వచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా ఆర్చి గేట్ వద్ద మాత్రం వీరికి పోలీసులు ఏమీ అనలేక వదిలేశారు. ఎమ్మెల్సీ హోదాలోను, గుడి డోనర్‌గా వచ్చిన వరుదు కల్యాణిని మాత్రం ఒక్కరికే అనుమతినివ్వడంతో ఓ గంట సేపు ఆర్చి వద్ద ఉండిపోయారు. రాజాం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పరిస్థితైతే వర్ణనాతీతం. తొమ్మిదిమందితో వచ్చిన ఆయన్ను సుమారు 2 గంటల పాటు పోలీసులు తమ చుట్టూనే తిప్పుకున్నారు తప్ప కనికరించలేదు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ముందుగానే హెచ్చరించడంతో పోలీసు కుటుంబాల దర్శనాలు తగ్గాయి. రూ.500 క్యూలో ఓ మహిళ స్పృహ తప్పిపడిపోవడంతో స్ట్రెక్చర్ తెచ్చినా అప్పటికే ఆమె ఆరోగ్యం కుదుటపడి దర్శనానికి వెళ్లడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఉదయం ఏడు గంటలకు డీఐజీ గోపీనాథ్ జెట్టి దర్శించుకోవడానికి వచ్చారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ సతీసమేతంగా వచ్చారు.



సొమ్మసిల్లిన మహిళకు సపర్యలు



క్యూలైన్‌లో పాలు పంచుతున్న భక్తులు

ఉద్యోగులకు ఉపవాసమే

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉత్సవ నిర్వహణలో కష్టపడి పనిచేసిన ఉద్యోగులకు రథ సప్తమి రోజున ఉపవాసం తప్పలేదు. సూర్య భగవానుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు వైద్య సేవలందించే డాక్టర్లకు, స్టాఫ్ నర్సులకు, 104,108, కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది, మత్స్యశాఖ సిబ్బందిని ఎవ రూ పట్టించుకోలేదు. ఉదయం టిఫిన్, భోజనం, మంచినీళ్లు, బిస్కెట్ ప్యాకెట్ కూడా ఇచ్చిన నాథుడు లేడని వారంతా మండిపడ్డా రు.

మాజీ ఎమ్మెల్యే కళావతికి అవమానం

పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతిని సైతం పోలీసులు లోపలికి విడిచిపెట్టకుండా అవమానించారు. ధర్మాన కృష్ణదాస్ వచ్చి చెబితే విడిచిపెట్టారు.



ప్రణతోస్మి దివాకరం



పాల ధారల్లో భానుడు.. నిజరూపంలో ఆదిత్యుడు.. స్వర్ణాలంకరణలో సూర్యనారాయణ మూర్తి.. రథ సప్తమి నాడు దినకరుడు మూడు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చాడు. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు జరిగిన క్షీరధారల మధనం తర్వాత అరుణ శిలపై స్వామి నిజ రూపం చూసి భక్తులు తన్మయత్వానికి గురయ్యారు. అనంతరం స్వర్ణాలంకరణ భూషితుడైన స్వామిని చూసి మురిసిపోయారు. అధికారుల అతి ఉత్సాహం, దాతల నిరుత్సాహం వంటివి పంటి కింద రాయిలా అనిపించాయి.

- ఘనంగా రథసప్తమి ఉత్సవం
- నిజరూప దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- అసంతృప్తి వ్యక్తం చేసిన దాతలు
- సాధారణ దర్శనానికి మూడున్నర గంటల సమయం



క్యూలో భక్తులు



అరసవల్లి:

మాఘ శుద్ధ సప్తమి పర్వదినం సూర్యజయంతి (రథసప్తమి) సందర్భంగా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రాత్రి 9 గంటల వరకు అరసవల్లిలో సూర్యనారాయణ మూర్తిని వేలాది మంది దర్శించుకున్నారు. అర్ధరాత్రి నుంచి క్షీరాభిషిక్తుడైన ఆదిత్యుడు.. తర్వాత నిజ రూపంలో భక్తకోటికి దర్శనమిచ్చి..అనంతరం సాయంత్రం నుంచి స్వర్ణాలంకరణలో వెలుగులు నింపారు. ఉదయం 7 గంటల వరకు పంచామృతాలతో పాటు క్షీరాభిషేకం జరిగిన అనంతరం సప్తమి ఘడియల్లో భక్తులకు ఒకేసారి క్షీరాదిత్యుడిగానూ నిజరూపంలోనూ దర్శనమివ్వడంతో భక్తజనం పులకించిపోయారు. సుమారు 60 వేల మందికిపైగా భక్తులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వర్ణాలంకరణలో ఆదిత్యుని మూల విరాట్టు దర్శనమిచ్చారు. భక్తులు సంప్రదాయంగా సూర్యోదయ సమయంలోనే పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండి స్వామికి ప్రసాదంగా నివేదించారు.

తెర మీదకు వీవీఐపీ, శీఘ్ర దర్శన పాసులు

రథసప్తమి నాడు దాతల పాసులు, వీఐపీ (రూ.300) టిక్కెట్లు, క్షీరాభిషేక టిక్కెట్లు (రూ.500), ప్రత్యేక దర్శనం (రూ.100) తదితర దర్శన టిక్కెట్లు అధికారికంగా అందుబాటులో ఉన్నాయి. అయితే మంగళవారం ఉదయం నుంచి అనూహ్యంగా వీవీఐపీ పాసులతో పాటు శీఘ్ర దర్శనం పేరిట అరసవల్లి గ్రామంలో సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయించిన పాసులు పెద్ద పాత్రే పోషించాయి. వాస్తవానికి దాతల పాసులు ఎక్కువగా ఉన్నట్లుగా భావించి, భారీగా కోత విధించిన ఉన్నతాధికారులు ఇప్పుడు ఎలా వీవీఐపీ పాసులు, శీఘ్ర దర్శనం పేరిట లోకల్ (ఎమ్మెల్యే కోరిక మేరకు) దర్శన పాసులు ప్రవేశపెట్టడం తీవ్ర చర్చనీయాంశమైంది. రథసప్తమి ఉత్సవానికి ఆలయ అభివృద్ధికి విరాళాలిచ్చిన దాతలను కాదని, కొత్తగా పాసుల పేరిట వందలాది మందిని దర్శనాలకు రెడ్ కార్పెట్‌లో పంపించడం దారుణమనే విమర్శలు వినిపించాయి. సాధారణ దర్శనానికి సుమారు 3 గంటలకు పైగా దర్శన సమయం పడితే.. దాతల పాసుల ద్వారా సుమారు గంట సమయం పట్టింది. ఈ ప్రత్యేక పాసుల ద్వారా అరగంటలోపే దర్శనం జరిగింది.



క్షీరాన్నం తయారు చేస్తూ..



క్యూలో అవస్థలు



కంట్రోల్ రూమ్‌లో డీఐజీ గోపీనాథ్, ఎస్పీ మహేశ్వర రెడ్డి



వాకీటాకీతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పర్యవేక్షణ

నకిలీ రూ.300 టిక్కెట్లు

ప్రత్యేక స్లాటెడ్ దర్శనాల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అరసవల్లి యూనియన్ బ్యాంక్ లో విక్రయించిన రూ.300 టిక్కెట్లు బయటకు రాగానే డూప్లికేటింగ్ అయ్యాయనే చర్చ జోరందుకుంది. అధికారిక లెక్కల ప్రకారం నాలుగు స్లాటు ల్లో మొత్తం 6 వేల టిక్కెట్లు విక్రయించారు. అదీ ఆర్డీఓ లెటర్ ఆధారంగానే ఇచ్చారు. అయితే మార్కెట్లోకి 8 వేల సిరీస్‌తో కూడా టిక్కెట్లు దర్శనమిచ్చా యి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ స్లాట్లలో టిక్కెట్లను విక్రయించారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాతల పాసుల కదింపు ప్రభావం ఈ టిక్కెట్లపై పడినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ టిక్కెట్ల వ్యవహారమే తనకు తెలియదని, సమాచారం లేదని ఆలయ ఈఓ చెప్పడం గమనార్హం.

అవస్థలు...సేవలు

అరసవల్లి క్షేత్రంలో చేపట్టిన ఏర్పాట్లతో భక్తులకు ఒకింత అవస్థలకు గురయ్యారు. మరోవైపు స్వచ్ఛంద సంస్థలు ఇతోధికంగా సేవ చేశాయి. బందోబస్తు విషయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గట్టి ఏర్పాట్లు చేశారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి కూడా ఏర్పాట్లను పరిశీలించారు.

దర్శించుకున్న ప్రముఖులు

రథసప్తమి సందర్భంగా పలువురు ప్రముఖులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. నరసన్నపేట, పాతపట్నం, పలాస ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, గౌతు శిరీష తదితరులతో పాటు మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, అలాగే తెలంగాణ రాష్ట్రం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. వీరితో పాటు మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, ప్రముఖ గాయని మంగ్లీ, పార్వతీపురం మన్యం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు నిదర్శనం

- పాసుల విషయంలో ఎదురైన ఇబ్బందులు
- శఠగోపం, తీర్థం లేకుండానే దర్శనం

అరసవల్లి: రథ సప్తమి నాడు ఆదిత్యుడిని దర్శించుకోవాలనుకున్న వారికి చుక్కలు కనిపించాయి. అరసవల్లి సూర్యక్షేత్రంలో సోమవారం అర్ధరాత్రి క్షీరాభిషేకాలు ప్రారంభమై మంగళవారం రాత్రితో ముగిశాయి. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి నిజరూపంలో ఆదిత్యుడు దర్శనమిచ్చాడు. అయితే అంతకుముందు భారీగా భక్తులు తరలిరావడంతో ఆర్చి గేట్ వద్ద అలాగే ఆలయం లోపల స్వల్ప వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి.



ఇలా రోడ్డుపై ప్రసాదాలు విక్రయిస్తూ...

తాళాలు బద్దలు గొట్టి..

దాతలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా చర్యలకు దిగారు. ఒంటి గంట అవుతున్నా.. దర్శనానికి క్యూలైన్ ఓపెన్ చేయకపోవడంతో దాతలు మండిపడుతున్న త రుణంలో ఈ క్యూలైన్ బాక్సు తాళాలను బద్దలు గొట్టి మరీ దర్శన మార్గాన్ని తెరిపించారు. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటన చర్చనీయాంశమైంది. వీరిని రూ.500 దర్శనం (అభిషేకం) క్యూలైన్లలో కలిపేశారు. అలాగే సింహద్వారం నుంచి అనుమతించిన వీఐపీ పాసుదారులను కూడా ఇదే లైన్‌లో కలిపేశారు. దీంతో దాతలకు పాట్లు తప్పలేదు.

శఠగోపం..తీర్థం ఇవ్వకుండా

రథసప్తమి నాడు ఆదిత్యుని క్షీరాభిషేక సేవను చూసి తరించిన భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం శఠగోపం, తీర్థం ఇవ్వడం ఆనవాయితీ. కానీ ఈ ఏడాది ఆ భాగ్యం లేకుండా పోయింది. అక్కడున్న పోలీసులకు అర్చకులు, భక్తులు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది.

ఆదిత్యుని ఆదాయానికి గండి..

రథసప్తమి నాడు వేలాది మంది భక్తులు తరలిరావడంతో రూ.100, రూ.500 దర్శన టిక్కెట్లు ద్వారా, అలాగే లడ్డూ పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా భారీగా ఆదాయం రానుందని ఆలయ అధికారులు అంచనాలు వేశారు. కేవలం లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా ఒక్క రథసప్తమి రోజునే సుమారు రూ.15 లక్షల వరకు ఆదాయం లభించింది. అయితే తాజాగా పోలీసుల చర్యల కారణంగా ఆలయ ఆదాయానికి భారీగానే గండి పడినట్టైంది. ప్రసాదాల తయారీ నుంచి పులిహోర ప్యాకెట్లను, లడ్డూలను ఓ వాహనంలో సుమారు అర కిలోమీటర్ దూరం తీసుకెళ్లి విక్రయాలు చేశారు. దీంతో పెద్దగా ఎవరూ కొనలేదు. రాత్రి మాత్రం అన్ని క్యూలైన్లను కలిపేశారు.

ప్రత్యేక లైన్ లేదు



దాతలకు ప్రత్యేక దర్శన మార్గం ఏర్పాటు చేయకపోవడం ఏంటి..? ఒక లైన్‌లో వచ్చి...ఇంకో లైన్‌లో కలి పేయడమేంటి..? ఇది దారుణం. దాతలకు ఇచ్చి న విలువ ఇదేనా. ఇలా అయితే భవిష్యత్‌లో విరాళాలెలా ఇస్తారు.?

– పొన్నాడ రుషి, దాత

ఏర్పాట్లు బాగున్నాయి కానీ..



ఏటా రథసప్తమి నాడు అరసవల్లి వస్తుంటాం. ఈ ఏడాది ఏర్పాట్లు బాగున్నాయి. దర్శనం కూడా బాగా అయ్యింది. నిజరూపం చూసి తరించాం. అయితే దాతల పాసు ద్వారా దర్శనానికి వచ్చాం. క్షీరాభిషేకం లైన్‌లో కలిపేసి దర్శనానికి పంపించారు. ఇది బాగోలేదు.

– ముని, ఢిల్లీ, గిరిష్, నవీన్, (తిరుపతి)



న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు



దర్శనానికి ఎస్పీ కుటుంబ సభ్యులు



మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



సీదిరి అప్పలరాజు దంపతులు



ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబం



వైఎస్సార్‌సీపీ నేతలు ధర్మాన కృష్ణదాస్, కళావతి తదితరులు

ఆదిత్యుని సేవలో ప్రముఖులు

రథ సప్తమి పర్వదినాన ప్రముఖులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు తమ కుటుంబాలతో పాటు స్వామిని దర్శించుకున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణ చేశారు. తిథి సెంటిమెంట్‌తో పలువురు రెండుసార్లు దర్శించుకున్నారు. -శ్రీకాకుళం పాతబస్టాండ్

డిగ్రీ స్పెషల్ డ్రైవ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు షెడ్యూల్‌ను అధికారులు మంగళవారం విడుదల చేశారు. విద్యార్థుల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డిగ్రీ 2015, 16, 17, 18, 19 బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఈ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొదటి సెమిస్టర్ ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు, మూడో సెమిస్టర్ మార్చి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. పరీక్షలను వర్సిటీ కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించనున్నారు.

బ్రాహ్మణతర్లా టీచర్‌కు అరుదైన పురస్కారం



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న కొయ్యల శ్రీనివాసరావు

పలాస: పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సైన్సు ఉపాధ్యాయునిగా, జాతీయ హరిత క్లబ్ (ఎన్జీసి)క్లస్టర్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కొయ్యల శ్రీనివాసరావుకు అరుదైన పురస్కారం లభించింది. సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ)నిర్వహించిన గ్రీన్ స్కూల్స్ ప్రోగ్రాంలో పర్యావరణ హిత కార్యక్రమాలకుగాను గ్రీన్ పురస్కారానికి ఎంపికయ్యారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో మంగళవారం స్టెయిన్ ఆడిటోరియంలోని ఇండియా హాబిటేట్ సెంటర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ నుంచి ఈ అవార్డును శ్రీనివాసరావు అందుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణరావు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలాశంకరం, ఉపాధ్యాయ సిబ్బంది అతన్ని అభినందించారు.

ఆధ్యాత్మిక తీరం



రథ సప్తమి సందర్భంగా జిల్లాలోని సముద్ర తీరాలు భక్తులతో కళకళలాడాయి. వేకువజామున సముద్ర తీరానికి వచ్చిన భక్తులు పవిత్ర స్నానాలు చేసి సూరీడికి అర్ఘ్యాలు సమర్పించారు.

– సోంపేట

క్లుప్తంగా

17 నుంచి వాసుదేవ బ్రహ్మోత్సవాలు



మందస: మండల కేంద్రం మందసలో వాసుదేవ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామివారి కల్యాణం, చక్రతీర్థం, తెప్పోత్సవం, రథోత్సవంతో పాటు అనేక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా జరుగుతాయని, పరిసర ప్రాంతాలతో పాటు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నవోదయ హాల్‌టికెట్లు సిద్ధం

సరుబుజ్జిలి : వెన్నెలవలస వద్ద జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 9, 11 తరగతుల ఎంపిక పరీక్ష హాల్ టికెట్లు ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 8న 9వ తరగతికి సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయంలో, 11వ తరగతికి సంబంధించి సరుబుజ్జిలి వద్ద వెంకటసాయిపబ్లిక్ స్కూల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్ : హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్స్ తరపున పదో తరగతి, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ చదివిన నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకెండ్ ఫ్లోర్‌లో బ్యూటీ థెరపిస్ట్, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని, ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 28 ఏళ్ల వారు అర్హులని, పూర్తి వివరాలకు రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో గానీ, 7680945357, 9121999654 నంబర్లను గానీ సంప్రదించాలని కోరారు.

కమ్మసిగడాంలో కల్యాణ రాట



పెళ్లిరాట వేస్తున్న మహిళలు

రణస్థలం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా కొలిచే కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి పెళ్లిరాట కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు, మహిళలు మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, అధ్యక్షుడు వి.వి.ఎస్.వి.ప్రసాద్‌లు మాట్లాడుతూ రథసప్తమి నాడు కల్యాణ రాట వేయడం ఆనవాయితీగా వస్తోంది. మహాలక్ష్మి తల్లి, గురప్పదొరల కల్యాణం ఈ నెల 7వ తేదీ రాత్రి 9.25 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, కమిటీ సభ్యులు రాజారవిచంద్ర తేజ, రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, సురేష్ కుమార్, మురళీధర్, రాయుడు, మన్నె కృష్ణానందం, మౌళి, రఘునాథ్, తాతీయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే విజయం ఖాయం



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

టెక్కలి: లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే కచ్చితంగా విజయం సొంతమవుతుందని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సీహెచ్.సుధాకర్, కార్యదర్శి డి.వి.రమణ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్నో విజన్ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇన్నోవేట్ నౌ, కోడ్ వార్, డీ బగ్ చాలెంజ్, మైండ్ మాస్టర్ వంటి పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలైన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ ఆదిత్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర విద్యార్థులకు 50 వేల రూపాయల నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ వై.రమేష్, డీన్ యు.డి.ప్రసన్న, కో–కన్వీనర్ టి.రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పూత దశలో.. మంచు దెబ్బ

- జీడి మామిడి తోటలపై తీవ్ర ప్రభావం
- ఉద్యాన రైతుల తీవ్ర ఆందోళన
- జిల్లాలో సుమారు 23 వేల హెక్టార్లలో సాగు



పూతకు నోచుకోని జీడి తోట



ఏడేళ్లలో జీడి పంట దిగుబడి వివరాలు:

ఏడాది	పంట విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)
2018	24,087	11,455
2019	14,500	3700
2020	20,300	11,300
2021	23,089	11,050
2022	24,080	3900
2023	24,080	12.040
2024	22,942	11.471
2025	22,942	....

వజ్రపుకొత్తూరు రూరల్: చిగురు, పూత దశలో ఉన్న జీడి మామిడి తోటలపై పొగ మంచు తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏటా ఈ సీజన్‌లో మంచు ప్రభావం సాధారణమేనైనా ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో గత కొద్దిరోజులుగా మంచు కురుస్తోంది. ఫలితంగా పూత రావడం లేదని, కొన్నిచోట్ల వచ్చినా మాడిపోతోందని రైతులు ఆందోళన చెందుతు న్నారు. అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌లో తెల్ల బంగారంగా గుర్తింపు పొందిన జీడి పప్పుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఉద్దానంలో మంచు ఈఏడాది ముంచేస్తోందని వాపోతున్నారు. జీడి పంట సాగు, ఆధారిత పరిశ్రమలను నమ్ముకొని ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది జీవనోపాధి సాగిస్తున్నారు.

భారీ విస్తీర్ణంలో సాగు..

జిల్లాలో 30 మండలాల్లో ఈ ఏడాది 22,942 హెక్టార్లలో జీడి పంట సాగుచేస్తున్నారు. అత్యధికంగా ఉద్దాన ప్రాంతమైన వజ్రపుకొత్తూరు మండలంలో 3085 హెక్టార్లు, మందస మండలంలో 2983 హెక్టర్‌లు, కొత్తూరు మండలంలో 2750 హెక్టార్లు, మెళియాపుట్టి మండలంలో 2401 హెక్టార్లు, పలాస మండంలో 1069 హెక్టార్లలో సాగు అవుతోంది. మిగిలిన పంటలను సీతంపేట, భామిని, లావేరు, రణస్థలం తదితర మండలాల్లో పండిస్తున్నారు. దాదాపు 2 లక్షల మంది రైతులు సాగు చేస్తున్నారు. సుమారు 3 లక్షల మంది జీడి కార్మికులు, వ్యాపారులు జీడి ఆధారిత పరిశ్రమలను నమ్ముకొని ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు పంటపై ప్రతికూలంగా మారాయి. పూత ఆలస్యం కావడంతో పాటు కొన్ని చోట్ల పూత వచ్చినప్పటికీ పొగ మంచు ప్రభావంతో మాడిపోతోంది. ఏడేళ్ల క్రితం వచ్చిన తిత్లీ తుఫాన్‌తో జరిగిన నష్టాలను రైతులు అధిగమిస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పంటను పునఃరుద్ధరించారు. మళ్లీ ఇప్పుడు వాతావరణ పరిస్థితులు ప్రభావంతో తోటలకు ముప్పు వాటిల్లుతోంది.

దిగుబడిపై ప్రభావం..

ఏడాదిలో జీడి పంటకు మూడు దశలలో పూత వస్తుంది. నవంబర్–డిసెంబర్‌లో మొదటి సారిగా పూత వస్తుంది. జనవరి–ఫిబ్రవరిలో రెండో దశలో పూత, మార్చిలో మరో దశ పూత వస్తుందని ఉద్యానవన శాఖా అధికారులు చెబుతున్నారు. వీటిలో జనవరి– ఫిబ్రవరిలో వచ్చే పూత మాత్రమే అనుకూలిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ సమయంలో పొగమంచు, తేనె మంచు ప్రభావంతో పాటు టీ దోమ పంటకు ఆశించే ప్రమాదం ఉందన్నారు. వీటి నివారణకు పంట సాగులో యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలతో దిక దిగుబడులు సాధించవచ్చు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి రైతులు సరైన పద్ధతిలో పంట సాగు చేస్తే ప్రతి హెక్టార్‌కు 700–850 కేజీల జీడి దిగుబడి వచ్చే అవకాశముంది. అయితే ఈ ఏడాది జనవరి ముగిసి ఫిబ్రవరి ప్రారంభమవుతున్నా కొన్నిచోట్ల పూత రాలేదు.

వాతావరణం సహకరిస్తేనే..



పంట సాగు చేసేందుకు ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుపెట్టాం. ప్రస్తుతం మంచు బాగా కురుస్తుండటంతో దిగుబడిపై ప్రభావం ఉంటుంది. ఫిబ్రవరి ఆరంభమవుతున్నా జీడిపూత కానరావడం లేదు. వాతావరణ పరిస్థితులు మా ఆశలను నీరుగార్చాయి.

– తామాడ మోహన్, జీడి రైతు, బైపల్లి

పూత ఆలస్యం..



జీడి పంట సాగుకు వేలాది రూపాయలు మదుపు పెట్టాం. ఈ ఏడాది జీడి పూత ఆలస్యమైంది. కొన్నిచోట్ల వచ్చినా కొంత పూత మంచుకి మాడిపోతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏటా పంట దిగుబడిపై ఆశలు లేదులుకోవాలి.

– వద్ది కేశవ, జీడిరైతు, దోకులపాడు

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి..



జీడి పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు, అధికారులతో కలిసి గ్రామాల్లో పంట సాగు, సస్యరక్షణ చర్యలు పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సీఎస్ఆర్‌బీ ఆశించి చెట్టును పూర్తిగా తొలగించాలి. చెట్టు కొమ్మలను కత్తిరించి మొదలు ప్రాంతం శుభ్రం చేయడంతో పురుగులు, తెగుళ్లను నియంత్రించవచ్చు.

– ఆర్.వి.ప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, శ్రీకాకుళం

సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కెవీజీడీ బాలాజీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో మార్చి 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ –2025 (టెక్నివర్స్ 2కె25) పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేలా నూతన ఆవిష్కరణలు, పరిశోధనాత్మక విద్య అంశం ఆధారంగా పలు విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రముఖ ఐఐటీల నుంచి నిపుణులు హాజరై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెన్సార్ టెక్నాలజీ, హైడ్రాలజీ, పవర్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ బిహేవియర్ ఆఫ్ హై టెంపరేచర్ అల్లాయ్స్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. టెక్నికల్ ఈవెంట్లు సైతం జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, టెక్నివేర్స్ కన్వీనర్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రంలో కంప్యూటర్ చోరీ



తెరిచి ఉన్న తలుపు

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు రైతు సేవా కేంద్రంలో సోమవారం రాత్రి కంప్యూటర్ చోరీకి గురైంది. వీఏఏ పోలాకి శివ కుమార్ మంగళవారం ఉదయం విధులకు హాజరయ్యేసరికి తలుపులు విరగ్గొట్టి ఉండటం గమనించారు. వెంటనే ఎంఎస్‌కే సమాచారమిచ్చి లోపలికి వెళ్లి చూడగా కంప్యూటర్ చోరికి గురైనట్లు గుర్తించారు. అనంతరం సారవకోట పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

జలుమూరు : మండలంలోని పెద్దదూగాంలో అక్రమంగా నిల్వచేసిన 32 మద్యం బాటిళ్లను కోటబొమ్మాళి ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఈ బాటిళ్లను ఉంచి అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు సమాచారం. అయితే సదరు వ్యక్తిపై కేసు నమోదు కాకుండా టీడీపీ నాయకులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.ఈ విషయమై ఎక్సైజ్ సీఐ గాయిత్రి వద్ద ప్రస్తావించగా ప్రత్యేక బృందాలు పెద్ద దూగాం వెళ్లాయని, పూర్తి వివరాలు బుధవారం వెల్లడిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- చౌటుప్పల్‌లో ఘటన
- బైక్‌పై వెళ్తుండగా దుర్ఘటన
- మృతుడు ఇచ్ఛాపురం వాసి

చౌటుప్పల్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ స్టేజీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం అందెపల్లి గ్రామానికి చెందిన ఇసరు ఉదయ్(25)తో పాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాగాడి రాజేష్, మందడుగు ఉపేందర్ చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామ పరిధిలోని దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. అదే కంపెనీకి చెందిన హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు ముగ్గురు కలిసి బైక్‌పై మంగళవారం యాదగిరిగుట్టకు వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని మధ్యాహ్నం తిరిగి హాస్టల్‌కు వెళ్తుండగా లింగోజిగూడెం గ్రామం వద్ద బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ఉదయ్ మృతిచెందాడు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో సూర్యనమస్కారాలు





రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో రథసప్తమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక సూర్యనమస్కారాలు కార్యక్రమం నిర్వహించారు. ప్రీ యూనిర్సిటీ కోర్సు, ఇంజినీరింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు డైరెక్టర్ ప్రొఫెసర్ కెవీజీడీ బాలాజీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్





వైఎస్ జగన్‌ను కలిసిన స్వరూప్



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ యువ నాయకుడు ఎం.వి.స్వరూప్ మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డి లండన్ నుంచి తిరిగి వచ్చిన సందర్భంగా కలిసి జిల్లాలో పార్టీ పరిస్థితిపై కాసేపు చర్చించారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ప్రజలకు మరింత చేరువగా ఉంటా



కంచిలిలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ నేతలు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి : ఇచ్ఛాపురం నియోజకవర్గం మధ్యన గల కంచిలి మండల కేంద్రంలో ఎమ్మెల్సీ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా వైఎస్సార్ సీపీ క్యాడర్‌కు మరింత చేరువగా ఉంటానని జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు పేర్కొన్నారు. రథసప్తమి పర్వదినం సందర్భంగా కంచిలి మెయిన్ రోడ్డులో నూతనంగా నిర్మించిన సొంత భవనానికి వైఎస్సార్ కాంప్లెక్స్‌గా నామకరణం చేసి, అందులో ముందు భాగంలో విశాలమైన గదిని ఎమ్మెల్సీ కార్యాలయంగా ఏర్పాటు చేస్తూ మంగళవారం నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నియోకవర్గంలోని నలుమూలల నుంచి వచ్చే పార్టీ కార్యకర్తలకు తన స్వగ్రామం కవిటి మండలం కొత్తపుట్టుగ కంటే కంచిలి మెయిన్ రోడ్డులో ఉన్న కొత్త కార్యాలయం మరింత అందుబాటులో ఉంటుందన్నారు. తద్వారా పార్టీ నియోజకవర్గంలో మరింత బలపడటానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, డాక్టర్ నిమ్మన దాస్, బోర పుష్ప, కడియా ప్రకాశ్, జెడ్పీటీసీ ప్రతినిధులు, పార్టీ నేతలు ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, రాజు, కడియాల ప్రకాశ్, మాజీ ఎంపీపీ పి.ఎం.తిలక్, కొల్లి ఈశ్వరరావు, నవీన్‌కుమార్ అగర్వాలా(బబ్లూ), జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పూడి నేతాజీ, రాంపత్ని చిట్టిబాబు, ఎమ్మెల్సీ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

యువకుడికి తప్పిన ప్రాణాపాయం



ప్రాణాలతో బయటపడిన సోమరెడ్డి మణి

వజ్రపుకొత్తూరు రూరల్: రథసప్తమి సందర్భంగా సముద్రంలో ఓ యువ భక్తుడు పుణ్యస్నానం చేస్తుండగా అపశృతి చోటు చేసుకున్న ఘటన అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామానికి చెందిన సోమరెడ్డి మణి వేకువజామున సముద్రంలో పుణ్యస్నానాలకు దిగి అలల తాకిడికి గల్లంతయ్యాడు. అదే సమయంలో తీరంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న శ్రీరామ సేవ సంఘం, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు వెంటనే అప్రమత్తమై కాపాడారు. అపస్మారక స్థితిలో ఉన్న మణికి ప్రథమ చికిత్స అందించి 108 అంబులెన్సులో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుడి ప్రాణాలను కాపాడిన మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కాస చలపతి, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాదరావు, కార్యదర్శి ఆర్జాల ఈశ్వరరావు, సభ్యులు ఎల్.నాయుడు, నారాయణ, మహేష్, బాలకృష్ణ, అనిల్‌ను పలువురు అభినందించారు.

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



చాపరాయి వద్ద పేరాడ తిలక్, నాయకులు

దుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా):

రాష్ట్రాభివృద్ధితో పాటు అల్లూరి జిల్లా మరింతగా అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్ స్పష్టం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందించారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరావులతో కలిసి మంగళవారం చాపరాయిలో పర్యటించి ప్రకృతి అందాలను తిలకించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ గిరిజనులు జగనన్నపై చూపిస్తున్న అభిమానం, ప్రేమ, అప్యాయత హర్షణీయమన్నారు. చంద్రబాబు పాలనలో గిరిజనులకు ఒరిగేదేమీ లేదన్నారు. అరకుతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే విశాఖపట్నంను రాష్ట్ర రాజధానిగా జగనన్న ప్రకటించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ఆరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయి విశాఖపట్నం రాజధానిగా చూడాలని కోరుకుంటున్న ప్రతి ఒక్కరి కలను సాధ్యం చేస్తారన్నారు. ఆయనతో పాటు టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు హేమచంద్ర రాజు, నందిగామ మాజీ ఎంపీపీ చక్రవర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులున్నారు.